పాన్పుకింద పగుళ్ళు

ఎక్స్‌ప్రెస్ రైలు ఒకసారి పెద్దగా అరచి బయలుదేరింది. జారి పోయే త్రాచు పాములా నున్నని పట్టాలమీద ముందుకు నడుస్తూ ఉంది. ప్లాటుఫారం దాటిం తరువాత ట్రెయిను స్పీడందుకొంది. పంట పొలాలు, అడవులు, కొండలు ఒక్కో దృశ్యం కొద్దిసేపు కనిపించి వెనక్కు పోతు న్నాయి.

కిటికీలోంచి చూస్తున్న రామకృష్ణ మనసు మనసులో లేదు. రైలు వేగంకంటే ముందుకు అతని ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి. తొమ్మిదేళ్ళ తరువాత చూడబోయే ఒకప్పటి తన స్నేహితురాలు, ప్రియురాలు అపర్ణ గుర్తుకు వస్తుంది. తమ ప్రణయం మొగ్గగా పుట్టి, పుష్పించే సమయంలో ఎండి రాలిపోయింది. తను ప్రేమించి, ఆరాధించి పూజించిన ఆ పర్ణ తనకు దక్కకుండా పోయింది. దాంతో విరక్తిగా మిలటరీలోకి వెళ్ళిపోయాడు.

అలా మిలటరీలోకి వెళ్ళిన రామకృష్ణ తరువాత తల్లిదండ్రుల దగ్గరకు కూడా రాలేదు. వాళ్ళతో తన క్షేమ సమాచారాలు, మిగతా అన్ని విషయాలు జాబుల మూలకంగానే తెలియజేసేవాడు. ఎంతమంది ఎన్ని చెప్పినా పెళ్ళి మానుకొని అపర్ణనే జపిస్తూ కూర్చుండిపోయాడు. రామకృష్ణకు తన గతాన్ని తలచుకొన్నప్పుడల్లా ఆ మధుర స్మృతులు గుర్తుకొచ్చి సేద తీరుస్తుంటాయి.

రామకృష్ణ, అపర్ణ ఒకే వూరివాళ్ళు. చిన్నతనంనుంచి ఒకరి కొకరు తెలిసినవాళ్ళే. స్కూలు ఫైనల్‌వరకు ఊళ్లోనే కలిసి చదువు

కొన్నారు. కాలేజీ చదువు ఊరికి పదిమైళ్ళ దూరంలో వున్న టౌనుకు వెళ్ళాల్సి వచ్చింది. రామకృష్ణ, అపర్ణ ఇంటర్మీడియట్‌లో చేరారు. రోజూ బస్సులో వెళ్ళి బస్సులో వచ్చేవారు.

ఒకరోజు కాలేజీలో అపర్ణను కొంతమంది అబ్బాయిలు ఏడిపించడం, అపర్ణ చెప్పుతో కొట్టడం, దాంతో స్టూడెంట్సంతా ఒకటై ఆమెపై దాడిచేయడం, ఆమెను కాపాడడంలో రామకృష్ణ చావుదెబ్బలు తినడం జరిగింది. స్వతహాగా అందగత్తె ఐన అపర్ణ కాలేజీ బ్యూటీగా పేరు గాంచింది. ఎందరు ఎంత కవ్వించినా, ఆశచూపినా చలించేది కాదు. పవిత్రంగా వుండేది. ఆమె గుండెలో స్థిరనివాసం ఏర్పరచుకొని పూజనీయుడయినవాడు రామకృష్ణ ఒక్కడే.

రామకృష్ణకు కూడా అంతే. వీణతీగెలను సవరించినంత మృదువుగా ఆమెతో మాట్లాడతాడు. అంతకంటే మృదువుగా ఆమెను స్పర్శిస్తాడు. ఆ ఊరినుంచి కాలేజీకి వెళ్ళే పదిమందిలోను వీళ్ళ స్నేహమంటే అంత పవిత్రంగాను గుర్తింపుగానూ ఉండేది. వారి నిష్కల్మషమయిన ప్రేమలో ఎటువంటి తప్పొప్పులు కనిపించేవి కావు.

కాలేజిలో ఆరోజు స్టూడెంట్స్ గొడవచేసిన తరువాత అపర్ణను కాలేజి మాన్పించివేసారు ఆమె తల్లిదండ్రులు. ఆరోజు రామకృష్ణ గుండెలమీద వాలి అనుభవించిన వేదన అంతా ఇంతా కాదు. రామకృష్ణ ఎంత చెప్పినా ఆమె తలిదండ్రులు వినలేదు. చివరకు అపర్ణ కాలేజి మానివేయక తప్పలేదు.

అపర్ణ తనను రామకృష్ణ రోజూ కలుసుకోవాలని మాట తీసుకుంది. రామకృష్ణ రోజూ కాలేజికి వెళ్ళి సాయంత్రం బస్సు దిగగానే నేరుగా అపర్ణ ఇంటికి వెళ్ళి ఆమెతో ఆనాటి కాలేజి విశేషాలు చెప్పి ఇద్దరూ తనివితీరా మాట్లాడుకొన్న తరువాతగాని ఇంటికి వెళ్ళేవాడు కాదు.

ఇది మొదట్లో సహజంగానే జరిగిపోయింది. కాని కొన్ని నెలలు గడిచే సరికి ఇది విషఫలితాలకు దారితీయసాగింది.

రామకృష్ణకు, అపర్ణ నీచ సంబంధాలు అంటగట్టారు ఆ పల్లెటూరి ప్రజలు రామకృష్ణ అపర్ణను ఉంచుకొన్నాడని ఊరంతా దుమారం రేగింది రామకృష్ణను ఇక తమ ఇంటికి రావద్దని ఖచ్చితంగా చెప్పేసారు ఆమె తల్లిదండ్రులు. రామకృష్ణ ముందే తల్లిదండ్రులమీద విరుచుకు పడింది అపర్ణ

"ఊళ్ళోవాళ్ళకు బుద్ధిలేకపోతే మీ తెలివేమయింది. వాళ్ళు గడ్డి తింటుంటే మనం తినేదేనా" అంటూ ఏడ్చింది.

రామకృష్ణ ఇక అక్కడ ఉండలేక అపర్ణకు 'సారీ' చెప్పి ఇంటికి తిరిగి వచ్చేసాడు. అతని మనసు వికలమయింది. అంతలోనే ఆలోచన లతో ఒకరకమైన జ్ఞానం వచ్చింది "ఔను పెళ్ళికాని ఆడపిల్ల ఇంటికి వెళితే అపవాదే గదా, అందుకే నా దేవతను పెళ్ళిచేసుకొని ఇంటికి తెచ్చు కొని పూజించుకొంటాను' అని నిశ్చయించుకొన్నాడు ఆ నిశ్చయంతోనే తల్లిదండ్రులతో ఈ విషయం కదిపాడు

అతని తండ్రి ఈ పెళ్ళికి ఒప్పుకోలేదు. "నీతో సమాన వయసు ఉన్న ఆడదాన్ని ఎలా చేసుకొంటావురా ఆయుఃక్షీణం. పెళ్ళామనేది నీకంటే నాలుగేళ్ళు చిన్నదిగా వుండాలి" అంటూ కసిరాడు అతని తల్లి కూడా "ఒరేయ్! చదువుకొంటున్నావు ఆ పిల్లను చేసుకొని ఏం బావుకొంటావురా? నీకు కళ్ళుమూసుకొని పాతికవేలు కట్నమిస్తారు" అంటూ కళ్ళనీళ్ళు ఒత్తుకుంది. రామకృష్ణ రెండ్రోజులు అన్నం తిన కుండా ఉగ్గబట్టేసరికి తల్లిదండులు అతని దారికివచ్చి ఈ పెళ్ళికి ఒప్పు కొన్నారు

ఐతే రామకృష్ణ ఆనందం ఆవిరయిపోయింది అపర్ణ తల్లి దండ్రులు ఈ పెళ్ళికి తాము ఒప్పుకొన్నారు. పట్నంలో ఉండే తన తమ్ముడికే తన కూతుర్ని ఇవ్వాలని పట్టుబట్టింది అపర్ణ తల్లి. అపర్ణ ససేమిరా తాను రామకృష్ణను తప్ప వేరేవాళ్ళను చేసుకోనని ప్రతిజ్ఞ చేయడంతో ఆమె తల్లి గన్నేరుకాయలు నూరుకొని తింది. దాంతో ఆమెకు ప్రాణాంతకమై వారంరోజులు హాస్పటల్‌లో ఉండాల్సి వచ్చింది. ఈ వారంరోజులతో చిక్కి శల్యమైపోయింది అపర్ణ. హాస్పటల్ ఆవ రణలో రామకృష్ణ, అపర్ణ ఒకరినొకరు కౌగలించుకొని ఏడ్చేవాళ్ళు.

మరుసటి నెలలో అపర్ణకు ఆమె మేనమామతో సంబంధం కుది ర్చింది ఆమె తల్లి. తల్లియొక్క పట్టుదల తెలిసిన అపర్ణ తెలిసి తెలిసీ తన తల్లిని చంపుకోలేక మౌనంగా ఊరుకొంది. మౌనమే అంగీకారంగా చేసుకొని ముహూర్తాలు పెట్టేశారు. రామకృష్ణ శరీరం కొలిమిలో కాల్చి నంత బాధపడింది మనస్సు ముక్కలయిపోయింది. అపర్ణ మనస్సు రామకృష్ణకు తెలుసు. అందుకే తనవలన ఎవరికీ ఎటువంటి ఇబ్బంది రాకూడదనే ఉద్దేశ్యంతో గాయపడిన మనసుతో ఎటో వెళ్ళిపోయాడు. తరువాత వారానికి ఇరవై రెండేళ్ళ అపర్ణకు, నలభై ఐదేళ్ళ మేనమామతో వివాహం నిరాఘాటంగా జరిగిపోయింది.

ఇది జరిగిన తొమ్మిదేళ్ళ తరువాత మళ్ళీ మొన్ననే తన ఊరికి వెళ్ళాడు రామకృష్ణ. ఈ సమయంలో అతని గుండె రాయి అయింది. ఆ రాయిలో ఓ సున్నితపుపొర వుంది. ఆ పొరలమాటున దాగివుంది అపర్ణ ఇప్పటికీ. అతని రాకకు ముసలి తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు. ఇంతవరకు తన యోగక్షేమాలు తెలియజేస్తూ నెలనెలా డబ్బు పంపించే వాడే కాని ఎప్పుడూ ఊరికి రాలేదు.

రామకృష్ణ మెలితిరిగి మీసాల్ని, కరకుతేలిన ముఖాన్ని, నిండైన

ఆకారాని ఎంతో మెచ్చుకొన్నారు. ఊళ్ళోనివాళ్ళు వినయం ఉట్టిపడేట్లు మాట్లాడారు, మిలటరీసంగతులు చెప్పమని గుమిగూడారు. అతను తెచ్చిన వింతయిన వస్తువుల్ని విచిత్రంగా చూసారు. అతను మిలటరీలోని డిసిప్లెయిను గురించి, అక్కడ సంఘటనలను గురించి కథలు కథలుగా చెబుతూంటే చెవులు రిక్కించుకొని విన్నారు.

సాయంత్రం వరకు ఉగ్గబట్టుకొన్న అతని మనసు ఇక నిలవలేక పోయింది. తల్లిదండ్రులు ఆ విషయం ఎత్తితే తనను చీవాట్లు పెడతారని మెల్లగా అపర్ణ ఇంటివైపు అడుగులు వేసాడు. ఇల్లు దగ్గరయ్యేకొద్దీ అతని అడుగులు తడబడసాగాయి. ఇంటికి తాళం వేసి వుంది. ఇల్లు శిధిలమయి అక్కడక్కడా గోడలు పడిపోయి వున్నాయి. ప్రహరీ గోడలు విరిగిపోయి వున్నాయి. ఇంటిముందు పెద్ద వేపచెట్టు, దానిచుట్టూ కట్టిన సిమెంటు అరుగుమీద ఎన్నోసార్లు తాము ఎదురెదురుగా కూర్చొని తీపి కబుర్లు చెప్పుకొనేవారు. ఇప్పుడు ఆ చెట్టుచుట్టూ వున్న అరుగు పగిలి చీమలు పుట్టలు పెట్టి వున్నాయి.

రామకృష్ణ ఎవరినీ వివరాలడగటం ఇష్టంలేక, నేరుగా తన క్లాసుమేటు, అపర్ణ స్నేహితురాలు అన జయంతి ఇంటికి నడిచాడు. జయంతి ఆ ఊళ్ళోనే తమ బంధువులలో ఒకర్ని వివాహం చేసుకొంది. అతను వ్యవసాయం చేస్తుంటాడు.

రామకృష్ణను ఎంతో ఆదరించి ఆహ్వానించింది జయంతి. కుశల ప్రశ్నలయ్యాక అసలు విషయం కదిపాడు రామకృష్ణ.

అపర్ణకు వివాహమైన మరుసంవత్సరంలోనే ఆమె తండ్రి చనిపోయాడని, తరువాత ఆమె భర్త ఆస్థంతా త్రాగుడుకు ఖర్చుపెడుతూ అపర్ణను బాధపెట్టేవాడని చెప్పింది. అపర్ణ ఆ బాధలు పడలేక భర్తను

వదలి వెళ్ళిపోయిందని, ఎవరి సాయంతోనో సినిమాల్లో చేరి టాపు స్టారుగా పేరుగాంచిందని తెలియజేసింది. మొదటి ఆమె అనుభవించిన కష్టాలు వినిబాధపడ్డా తరువాత ఆమె గొప్ప కళాకారిణిగా మారి నందుకు కొనియాడాడు.

రామకృష్ణ ఎంతో బలవంతం చేసిన మీదట గాని అపర్ణ అడ్రసు ఇవ్వలేదు జయంతి అపర్ణ పేరు మార్చుకొంది సినిమాకి అనుగుణంగా. తనకు మొదట్లో ఉత్తరాలు వ్రాసేదని, ప్రతిదాంట్లోనూ రామకృష్ణ పేరే విధిగా ఉండేదని తెలియజేసింది జయంతి తనపై అపర్ణకు గల అభి మానానికి ఎంతో ఆనందించాడు.

అపర్ణను చూసి ఓ పదిరోజులుండి పోదామని వచ్చిన రామకృష్ణ ఆమె పుట్టింట్లోనూ, అత్తవారింట్లోనూ లేదని తెలిసిన తరువాత సరిగ్గా నాలుగురోజులు కూడా ఉండలేక పోయాడు. తల్లిదండ్రులను ఎలాగో ఓదార్చి ట్రెయిన్‌లో అపర్ణను కలుసుకోవడానికి బయలుదేరాడు.

• • • •

రామకృష్ణ ఆలోచనలు వదలి ఈ లోకంలోకి వచ్చేసరికి రైలు ఒక పెద్దస్టేషనులో ఆగి ఉంది. జనం కోలాహలంగా అటూఇటూ తిరుగు తున్నారు.

రామకృష్ణ సీట్లోంచి లేచివెళ్ళి కొన్ని మాగజైన్సు తెచ్చుకొన్నాడు. పేజీలు తిప్పుతున్నాడుగాని అతని మనసు పుస్తకంమీద లగ్నం కావడం లేదు. "అపర్ణ టాప్ హీరోయిన్ కదా! ఎంత బిజీగా ఉంటుందో. తను వెళ్ళిన సమయానికి తనకంటే అందమయినవాళ్ళు, ఆస్తిపరులు, ప్రాణ మయినా ఇవ్వగలిగిన వాళ్ళు ఆమె అభిమానులున్నారు కదా. వాళ్ళ ప్రేమముందు తనను మరచిపోయి ఉండదు కదా. అని అనుమానం.

"ఎట్టి పరిస్థితుల్లోనూ తనను మరచిపోదు ఆమె మనసు తనకు తెలుసు లక్షలమధ్య కూరుకుపోయినా, భవంతుల్లోని మూరుమూల గదుల్లో ఉన్నా తన ఉనికి తెలిస్తే చాలు సర్వం వదులుకొని రాగలదు" అనే నమ్మకం అతన్ని కలవరపరస్తూ ఉంది.

మరో నాలుగు గంటలు ప్రయాణం అనంతరం రైలు సెంట్రల్ స్టేషన్‌లో ఆగింది. రామకృష్ణ బ్యాగుహోల్డరు పట్టుకొని స్టేషను బయటకు రాగానే టాక్సీలను బారులు, బారులుగా నిలిపిఉన్న డ్రైవర్లు "టాక్సీ సార్! టాక్సీ" అంటూ మెట్లదగ్గర నిలబడి వచ్చే ప్యాసెంజర్ల చెవుల్లో హోరు పెడుతున్నారు.

రామకృష్ణ తనబాగ్, హోల్డరును ఒక టాక్సీ డ్రయివర్‌కు అందించాడు. వాడు డిక్కీలో పెట్టి వచ్చేలోగా వెనకసీట్లో కూర్చున్నాడు. కారు వేగంగా ముందుకు కదిలింది రామకృష్ణ సూచన ననుసరించి కారును ఒక పెద్ద హోటలు ముందు ఆపాడు. అపర్ణను అప్పుడే కల్సుకో దలచుకోలేదు రామకృష్ణ. మరుసటిరోజు ఉదయాన్నే ఆమెను కలుసుకోవాలనేది అతని ఆలోచన

అందుకే ఆరోజు లాడ్జిలోనే విశ్రాంతి తీసుకొని సాయంత్రం బీచ్‌కి వెళ్ళాడు. కొద్దిసేపు సముద్రపు అంచున నిలబడి అలల స్పర్శను అనుభవించాడు. తరువాత కొద్దిదూరం నడిచి ఇసుకలో కూర్చొన్నాడు. అక్కడక్కడా జంటలు జంటలుగా ఆడామగా కలిసి కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు చిన్నపిల్లలు సముద్రపు అంచునే అలలతో ఆడుకొంటున్నారు. పెద్దవాళ్ళు పర్యవేక్షిస్తున్నారు

రామకృష్ణ ఆ అందాలు తిలకిస్తూండగానే చీకటిపడి పోయింది. బీచ్‌లో ఒక్కొక్కరే లేచి వెళ్ళిపోతున్నారు. కిరోసిన్ దీపాలు పెట్టుకుని చేగోడీలు, చెరుకురసాలు ఇంకా రకరకాలయిన వస్తువులు పెట్టుకొని

అమ్ముకొంటున్నారు కొందరు. రామకృష్ణ లేవబోతుండగా అతని ప్రక్కనే ఇద్దరు స్త్రీలు నడచి వెళ్ళారు. ఇద్దరూ ఎంతో ఆనందంగా నవ నవలాడుతూ ఉన్నారు. వారి దుస్తుల్లోంచి వెలువడిన సువాసనలు రామ కృష్ణ నాసికాపుటాలకు మత్తుగా దోచాయి.

రామకృష్ణ బట్టలకు అంటుకొన్న ఇసుక దులుపుకొని పైకిలేచాడు. అతను ముందుకు అడుగువేయబోతుండగా "వణక్కంసార్" అంటూ వచ్చాడొకడు.

"ఏం కావాలి"

రామకృష్ణను తేరపారజూసి "సార్ మీరు తెలుగువాళ్ళా. అయితే బాధేలేదు" అన్నాడు.

"ఏమిటి నువు చెప్పేది?"

"సార్! ఇప్పుడు మీ ముందునుంచి వెళ్ళిన వాళ్ళిద్దరూ సినిమా స్టార్స్ సార్. ఒకామె మయూరి. ఇంకొకామె వయ్యారి. మీకు వారిలో ఎవరు కావాలి. మీరు ఊ అంటే టాక్సీ తీసుకొస్తాను. వెళదాం"

రామకృష్ణ ఆలోచనలో పడ్డాడు. అతనికి స్త్రీ పొందు కొత్తగాదు. అతను అపర్ణతో సంబంధాలు తెంచుకొన్న తరువాత అక్కడక్కడా అందమైన ఎందరో స్త్రీలపొందు కోరాడు. కాని ఎవరినీ ప్రేమించలేదు. అందుకే ఇంత అందమయిన వాళ్ళను వదలడానికి బుద్ధి పుట్టలేదు.

"మీరేం భయపడకండి సార్. రాత్రికి అయిదువందలే. ఇప్పుడు వదలి మళ్ళీ ఉదయాన్నే మిమ్మల్ని మీ రూంకి చేరుస్తా."

"సరే. ఆ తెల్లచీర మనిషి."

"అయితే జానపద హీరోయిన్ మయూరి అన్నమాట. మీరు

రోడ్డెక్కండి. నేను టాక్సీ తీసుకొస్తాను" అంటూ వాడు పరుగెత్తుకు పోయాడు. రామకృష్ణ స్టన్ అయ్యాడు. ఆమె మయూరిగా పేరు మార్చుకొన్న అపర్ణ కాదుగదా. అయినా ఆమెకెందుకంత దుర్గతి పడుతుంది. గొప్పకోసం కొంతమంది పెద్ద హీరోయిన్ల పేరు పెట్టుకోవచ్చు. అని సమాధానపరచుకొన్నాడు.

రామకృష్ణ రోడ్డుమీదికి వచ్చేసరికి వాడు ఎక్కడనుంచో టాక్సీ తీసుకొచ్చి ప్రక్కనే స్లోచేస్తూ ఆపాడు.

టాక్సీ ఒక సన్నని సందులోంచి పోతూ ఉంది. సందుకు అటువైపు ఇటువైపు డాబాఇళ్ళు ఉన్నాయి. టాక్సీ ఒక డాబా ఇంటిముందు ఆగింది.

డ్రయివర్ రామకృష్ణను వరండాలో కూర్చోబెట్టి కాలింగ్‌బెల్ నొక్కాడు. తలుపులు తెరచుకోగానే లోపలికి వెళ్ళి ఏదో మాట్లాడాడు. తరువాత రామకృష్ణను తీసుకువెళ్ళి లోపల కూర్చోబెట్టి ఉండమన్నా వస్తానంటూ వెళ్ళిపోయాడు.

రామకృష్ణ గదిని పరిశీలనగా చూసాడు. ఆ గది ఐశ్వర్యవంతుల ఇల్లులా తులతూగుతూ ఉంది. గదికి నాలుగువైపులా ఉన్న ద్వారాలకు రంగుల డోర్ కర్టెన్‌లు వ్రేలాడుతున్నాయి. గదిలో ఒకవైపుగా డబుల్ కాట్ బెడ్ ఉంది. దానిపైన ఫోమ్ పరుపులు, దిండ్లు ఉన్నాయి. ఆ బెడ్ నాలుగయిదు వేలకు తక్కువ చేయదని అతని అంచనా. ఒకవైపు ఫ్రిజ్ ఉంది. ఇంకోమూల డ్రెసింగ్ టేబులుంది. అక్కడున్న టేబులుమీద ఎన్నో రకాలయిన సెంట్లు, పలురకాలయిన పౌడర్లు ఉన్నాయి. గోడల మీద రాధాకృష్ణుల శృంగారం మొదలుకొని, కళాఖండాలనతగిన చిత్రాలు కూడా ఉన్నాయి. రామకృష్ణ మెత్తని సోఫాలో కూర్చొని చల్లని గాలిని

అనుభవిస్తూ గదిలోని ఐశ్వర్యానికి ఆశ్చర్యపోతున్నాడు. మాగజైన్సు తిరగేస్తూ అర్థగంట గడిపాడు.

ఇంతలో వెనకవైపునుంచి డోరు కర్టెను తొలగించుకొని వచ్చింది మయూరి. అప్పుడే స్వర్గంనుంచి దిగివచ్చిన అప్సరసలా ఉంది. ఒళ్ళంతా కనిపించే పలుచని నైట్‌గౌను క్రిందివరకూ వేసుకొని ఉంది. బ్రాసరీ, అండర్‌వేర్ స్పష్టంగా కనిపిస్తూ ఉన్నాయి. టమేటారంగు శరీరచ్ఛాయతో కోమలంగా కనిపిస్తూ స్వర్గంనుంచి దిగివచ్చిన రంభను మరిపిస్తూ ఉంది.

రాగానే ఆమె రామకృష్ణకు కరచలనం చేసి "అయామ్ మయూరి స్వీట్ సిక్స్‌టీన్" ఇంగ్లీషులో స్టయిల్‌గా అని అతని పక్కనే సోఫాలో ఆనుకొని కూర్చొంది.

రామకృష్ణకు ఆకాశంమించి విమానం తన నెత్తిన కూలినట్లయింది. తల గిర్రునే తిరిగింది ఆమె ఎవరో కాదు తన అపర్ణ. మనిషి ఎంతో మారింది. శరీరం లావెక్కింది. అయినా ఆకర్షణ తగ్గలేదు.

అతని మనసు మనసులో లేదు. ఒకనాటి అపర్ణకు, ఇప్పటి మయూరికి ఎక్కడా సంబంధం లేదు. కాలేజీకి వెళ్ళేప్పుడు పైట కూడా జారకుండా జాగ్రత్తపడుతూ తన నడవడికలో సంస్కారం ఉట్టిపడుతూ ఎంతో పవిత్రంగా కనిపించే ఆమె ఎక్కడ? శరీరాన్ని బహిర్గతం చేస్తూ అట్టడుగుకు దిగజారిపోయిన ఈ మయూరి ఎక్కడ? దేవుడు అపర్ణ మనసును ఎందుకు బండరాయిలా చేసాడు అనుకొంటూ మథన పడసాగాడు.

తనను ఆమె ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తుపట్టలేదని రామకృష్ణకు తెలుసు. తన మిలటరీ ట్రెయినింగులో పర్వతారోహణ ఒక భాగం ఒక

సారి తాడుని ఆధారం చేసుకొని ఎక్కుతుండగా ముప్పై అడుగుల ఎత్తు నుండి జారిపడ్డాడు. అప్పుడు తలమీద, నుదుటిమీద గాయాలు తగిలి ప్రస్తుతం మచ్చలేర్పడ్డాయి. మీసాలు గుబురుగా, లావుగా ఉన్నాయి. ముఖంలో కాఠిన్యం వచ్చింది.

"మై నేమ్ ఈజ్ రామకృష్ణ" అనలేక అన్నాడు

"ఓ... నైస్ నేమ్. మీ రాకతో మా యిల్లు పావనమయింది."

"థాంక్స్"

"మరయితే పార్టీ చేసుకుందామా?" అంటూ అపర్ణలేచి తలుపులు అన్ని వైపులా బంధించింది. తరువాత తాపీగా ఫ్రిజ్ తెరిచి లోపల ఉన్న రకరకాల పదార్థాలను ప్లేటులో సర్దింది. టీపాయ్‌ను సోఫా ముందుకు జరిపింది.

"ఈట్, డ్రింక్ అండ్ ఎంజాయ్. ఇది ఈ మయూరి పాలసీ మిస్టర్" అంటూ బ్రాంది బాటిల్ ఓపెన్ చేసి రెండు గ్లాసుల్లో పోసింది అపర్ణ. తరువాత సోడా కలిపింది.

ఆమె ప్రస్తుత స్థితికి రామకృష్ణ ఎంతో బాధపడుతున్నాడు. ఆమె అలాంటి సిద్ధాంతాన్ని ఏర్పరచుకొంటుందని అతను కలలో కూడా అనుకొని ఉండలేదు.

ఆమె బ్రాందిగ్లాసును రామకృష్ణకు అందించి, తను ఒక గ్లాసు తీసుకొని ఛీర్స్ కొట్టింది. తరువాత ప్లేటులోని చికెన్ ఫ్రై అతని ముందుకు జరిపింది, రామకృష్ణ, అపర్ణ చికెన్ తింటూ మొదలు పెట్టారు. నాలుగు రౌండ్లకే రామకృష్ణ పనయిపోయింది. ఇక త్రాగలేక పోతున్నాడు. ఒళ్లు తేలిపోసాగింది. కాని అపర్ణ ఇంకో రెండు రౌండ్లు త్రాగింది. మిలటరీలో అలవాటుగా త్రాగే రామకృష్ణ ఆమె నిగ్రహానికి ఆశ్చర్యపోయాడు.

అపర్ణ తాగిన మత్తులో ఏదేదో అంటూ ఉంది "కమాన్ రామ కృష్ణా...కమాన్...ఏన్నాయ్‌మి...హో...రామకృష్ణా కిస్‌మి...కిస్..."

రామకృష్ణ ఆమెను చేతుల్లో తీసుకువెళ్ళి ఫోమ్‌బెడ్‌మీద పడుకో పెట్టాడు.

"రామకృష్ణ—ఐ వాంట్ యు" మత్తుగా కలవరిస్తూ అతన్ని వదలిపెట్టలేదు. ఆమెను మెల్లిగా తొలగించుకొని వచ్చి సోఫామీద కూర్చొన్నాడు. ఆమె బెడ్‌మీద అస్తవ్యస్తంగా పడి నిద్ర పోయింది.

రామకృష్ణకు ఆ రాత్రి నిద్రరాలేదు. డబ్బు వ్యామోహంలో పడి అపర్ణ ఎందుకంత చెడిపోయింది అనేదే ఆలోచిస్తున్నాడు. పదేపదే ఆమె సిద్ధాంతం అతన్ని కలవర పరుస్తూ వుంది. తెల్లవారుజామున ఆలోచనల్లో కుర్చీలో పడి నిద్రపోయాడు. ఎప్పటికో మత్తుగా కళ్ళు తెరిచాడు. టైము చూసుకొని ఉలిక్కి పడ్డాడు. ఉదయం తొమ్మిదయింది. ప్రక్క బెడ్ మీద అపర్ణలేదు. అతను బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని ఒకవైపు కర్టెను తొలగించి చూసాడు. ప్రక్కనే వేరొక ఖరీదయిన గది ఉంటుందనుకొన్న అతను అక్కడి దృశ్యం చూసి ప్రాన్పడిపోయాడు.

సన్నగా నడివలా ఉంది ఆ రూము. అందులో వస్తువులేమీ లేవు. నాలుగు సత్తుగిన్నెలు, ఇంకా ఏవేవో సోపుడబ్బాలున్నాయి. ఒక ముసలిది అటు తిరిగి అన్నం కలియబెడుతూ ఉంది.

రామకృష్ణ శబ్దం కాకుండా వెనుకకు తిరిగి ఇంకో కర్టెను తొలగించి బాత్‌రూంలోకి వెళ్ళివచ్చాడు. తర్వాత అతను మూడవవైపు గది తెరిచి చూసాడు. అది చాలా చిన్నగది. అక్కడ పాత సూట్‌కేసులు ఎత్తుగా ఉన్నాయి. ఒక తీగమీద పాత చీరెలు, చిసిగిన రవికెలు వ్రేలాడు

తున్నాయి. ఇంకో తీగమీద రెండు ఖరీదయిన చీరలు వ్రేలాడు తున్నాయి. రామకృష్ణ శబ్దం కాకుండా తలుపుని దగ్గరకు లాగాడు.

అతని కిప్పుడంతా ఆశ్చర్యంగా ఉంది. మయూరి పేరుతో సినిమా రంగంలో అడుగుపెట్టిన అపర్ణ గొప్ప కళాకారిణిగా లక్షలు సంపాదించిందనుకున్నాడు. కాని బెడ్‌రూం తప్ప మిగతా అన్ని గదుల్లో దారిద్ర్యం విలయతాండవం చేస్తూ పడుపు వృత్తిలో జీవిస్తూందని అనుకోలేదు

రామకృష్ణ వరండాలోకి వచ్చాడు. రాత్రి తనను తీసుకొచ్చిన టాక్సీ డ్రైవర్ అక్కడ కూర్చొని ఉన్నాడు. అతన్ని చూడగానే వినయంగా లేచి నిలబడ్డాడు.

"మయూరి ఎక్కడికి వెళ్ళుంటుంది?"

"ఇంకెక్కడికి సార్! ఎక్స్ట్రా వేషం దొరికుంటుంది వెళ్ళుంటుంది."

"హీరోయినే మయూరి ఎక్స్ట్రానా" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఒకప్పుడు టాప్ స్టారే. కాదనను సార్. ప్రస్తుతం ఆమెకు మార్కెట్ లేదు, సంపాదించిందంతా వ్యసనాలు తినేసాయి. ప్రస్తుతం ఆమెకు డబ్బు సంపాదించి పెట్టేది ఆ గదిలో వున్న పాన్పే. స్వంత భవనం కూడా ఈ మధ్యనే అమ్మేసింది."

"వెనుక గదిలో వున్న ముసలిది ఎవరు!"

"ఆమె తల్లి."

రామకృష్ణ టాక్సీ డ్రైవరుకు కమీషన్ ఇచ్చి పంపేశాడు.

అటువైపు ఏదో పనిమీద వచ్చిన ముసలిదాన్ని దగ్గరకు పిలిచాడు. ఆమె ఎండిపోయి బలహీనంగా ఉంది.

"నీ పేరేమిటి"

"నా పేరు రంగమ్మ నాయనా. మమూరి ఇంట్లో పనిమనిషి. బాబూ! రాత్రికికూడా అమ్మగారి దగ్గరకు వస్తారా."

ఆ పిలగొంతు అత్తదే. ఆ ముడుతలు తేరిన ముఖం ఒకప్పుడు రాజసం ఒలికేది. పరువు మర్యాదలకు ప్రాణం పెట్టేది. అటువంటి అత్తే ప్రస్తుతం రాత్రికి వస్తారా బాబూ అని అడుగుతోంది.

విరక్తిగా బయటకు నడిచాడు.

• • • •

అపర్ణ కంటికి కడివెడుగా ఏడుస్తోంది. గతరాత్రి జరిగిన దుర దృష్ట సంఘటన ఆమె హృదయాన్ని చిన్నాభిన్నం చేసింది. తాగి పడి పోయిన అపర్ణ ఎప్పుడో మెలుకువ వచ్చి లేచింది. టీపాయ్ మీదున్న హాండ్‌బాగ్‌ను మెల్లగా తెరిచింది డబ్బుంటుందేమోనని. మొదటగా మీదున్న డైరీ కనిపించింది. అందులో తన ఫోటో. క్రింద నీ ప్రేమ పూజారి రామకృష్ణ అని వ్రాసి వుంది. ఆమెకు యధార్థం బోధపడడానికి ఎంతోసేపు పట్టలేదు.

రామకృష్ణ లేచినప్పుడు అతనికి కనిపించకుండా పాత సామానుల గదిలో దాక్కుంది. అతడు గుమ్మందాటి వెళ్ళిన తర్వాతగాని గదిలోకి రాలేదు.

"ఎందుకు రామకృష్ణా! కాలరాచిన పువ్వుకోసం ఆరాటపడతావ్. నాది గాడి తప్పిన జీవితం. జీవచ్ఛవంలా బ్రతుకుతున్న నన్ను నీ హృదయంతోంచి తీసివేసి శాశ్వతసమాధి చేయ్. ఆల్ దట్ గ్లిట్టర్స్ ఈజ్ నాట్ గోల్డ్. నన్ను బ్రతికించే ఈ పాన్పు పూలపాన్పు కాదు,

బీటలు వారి పగుళ్ళు తీసిన నా జీవితానికిది నిదర్శనం" క్రింద కూర్చొని సోఫామీద తలపెట్టి కారే కన్నీటిని తుడుచుకొంటూ విలపిస్తోంది.

అదే సమయంలో రామకృష్ణ హోటల్ గదిలో కూర్చుని ఊబిలో కూరుకుపోయిన గొప్ప కళాకారిణి అపర్ణను ఎలా రక్షించి తన దానిని చేసుకోవాలా అని ప్రణాళికలు వేస్తున్నారు.

తన పెట్టుబడితో అపర్ణను హీరోయిన్‌గా బెట్టి ఒక మంచి సినిమా తీసి అపర్ణను తిరిగి ఉచ్ఛ స్థితికి తీసుకురావాలన్నది అతని నిశ్చయం.

*